సాక్షి
పెద్దపల్లి
ఆదివారం । 14 । జూలై । 2024



బోనాల ఉత్సవం

ధర్మారం: ఎర్రగుంటపల్లిలోని పరివార సమేత శ్రీదుర్గాదేవి ఆలయంలో బోనాల మహోత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తులతోపాటు విప్ లక్ష్మణ్‌కుమార్ ప్రత్యేక పూజలు చేశారు.



గనుల వేలం నిలిపివేయండి

రామగిరి: బొగ్గు గనుల వేలం పాట నిలిపివేయాలని హెచ్‌ఎంఎస్ జనరల్ సెక్రటరీ రియాజ్ అహ్మద్ ఆధ్వర్యంలో ఆర్జీ–3 జీఎం ఆఫీసు ఎదుట ధర్నా చేసి వినతిపత్రం అందజేశారు.

గరిష్ఠం/కనిష్ఠం
31.0/25.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతమవుతుంది. జిల్లాలోని కొన్నిచోట్ల ఉరుములతో కూడిన చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

తల్లిదండ్రుల పేరిట మొక్కలు నాటిన జడ్జి



మొక్క నాటుతున్న జడ్జి రవీందర్, గ్రామస్తులు

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): మేడ్చల్ జిల్లా మల్కాజిగిరి కుషాయిగూడ సీనియర్ సివిల్ జడ్జి సట్టు రవీందర్ శనివారం తన స్వగ్రామం కొదురుపాకలో తన తల్లిదండ్రుల పేరిట మొక్కలు నాటారు. సజీవంగా ఉన్నప్పుడు తల్లిదండ్రులపై చూపిన ప్రేమను వారిపేట నాటిన మొక్కలపైనా చూపించాలని ఆయన కోరారు. గ్రామస్తులు కూడా మొక్కలు నాటారు.

ఆక్సిజన్ స్థాయి పడిపోతోంది

వాతావరణంలో రేడియేషన్ శాతం పెరుగుతుండడంతో ఆక్సిజన్ స్థాయి పడిపోతోందని జడ్జి రవీందర్ ఆందోళన వ్యక్తం చేశారు. శ్రీప్రసన్నాంజనేయస్వామి ఆలయ ఆవరణలో గ్రామస్తులు తాడికొండ మల్లేశం, భాస్కర్‌రావు ఆధ్వర్యంలో మొక్కలు నాటి మాట్లాడారు. మొక్కలు వాతావరణ కాలుష్యాన్ని నియంత్రించి మానవ మనగడకు మార్గం సుగమం చేస్తాయని తెలిపారు. మాజీ సర్పంచ్ సాగర్‌రావు, గ్రామస్తులు కనుకయ్య, రాజాగౌడ్, శ్రీధర్, ఖాజామియా, మహేందర్, అయ్యగారు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రామగుండం బల్దియాలో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్



పనులు పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీకాంత్

సాక్షి ఎఫెక్ట్..

కోల్‌సిటీ/యైటింక్లయిన్‌కాలనీ/జ్యోతినగర్ (రామగుండం): రామగుండం నగరపాలక సంస్థలో అధికారులు శనివారం శానిటేషన్‌పై స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. 'పత్తాలేని ఫాగింగ్' శీర్షికన నగరంలో లోపించిన పారిశుద్ధ్యంపై ఈనెల 10న 'సాక్షి' కథనం ప్రచురించింది. ఇది బల్దియా అధికార యంత్రాంగంలో కదలిక తీసుకొచ్చింది. కలెక్టర్ కూడా పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించారు. వర్షాకాలం నేపథ్యంలో శని, ఆదివారాల్లోనూ ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టాలని ఆదేశారు జారీచేశారు. దీంతో శనివారం 8వకాలనీ, అల్లూరు, రాజీవ్‌తండా, మారేడుపాక, ఎన్టీపీసీ తదితర ప్రాంతాల్లో చేపట్టిన పారిశుధ్య పనులకు కమిషనర్ శ్రీకాంత్ స్వయంగా పర్యవేక్షించి సిబ్బందికి సూచనలు చేశారు. దోమలు, ఈగల లార్వాలు వృద్ధి చెందకుండా టైర్లు, కుండీలు, కొబ్బరిచిప్పల్లో నీటినిల్వలు పారపోయించారు.

సారూ.. దారి చూపరూ..



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

పెద్దపల్లిరూరల్: 'మా తాత, ముత్తాతలకాలం నుంచి పొలాలకు వెళ్తున్న తొవ్వను ఈ భూమి నాదేనని గిప్పుడు పిడుగు లింగయ్య దున్నేశాడ'ని బ్రాహ్మణపల్లి గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ సర్పంచులు గాండ్ల మల్లేశం, బొల్లం తిరుపతి, మాజీ ఉపసర్పంచులు ఓదెల రాజు, మేకల రాజయ్య తదితర రైతులు శనివారం స్థానిక తహసీల్దార్ రాజ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. 'రికార్డుల ప్రకారం ఇప్పటిదాకా మీరు నడుస్తున్న దారి నా సొంతభూమేనని చెప్పుకుంటున్న లింగయ్య.. ఆ భూమిని దున్ని నాట్లు వేశాడు. దీంతో మా పొలాల్లో వరినాట్లు వేసేందుకు వెళ్లలేక పోతున్నాం' అని బాధిత రైతులు తహసీల్దార్‌కు మొరపెట్టుకున్నారు. తమ పొలాలకు వెళ్లేలా దారి చూపాలని కోరారు. రెండు రోజుల్లోగా విచారణ జరిపించి చర్యలు తీసుకుంటానని తహసీల్దార్ హామీ ఇచ్చారని రైతులు తోట కాంతయ్య, గాండ్ల సదయ్య, తిరుమలేశ్, నరేందర్, రాజు, లక్ష్మయ్య, వెంకన్న, రాజేశం, నర్సింగం, రవి తదితరులు తెలిపారు.

వ్యాధుల నియంత్రణకు చర్యలు

ధర్మారం(పెద్దపల్లి): సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ అరుణశ్రీ ఆదేశించారు. డెంగీ కేసులు నమోదైన పత్తిపాక, చామనపల్లి గ్రామాల్లో శనివారం ఆమె పర్యటించి పారిశుధ్య పనులు పరిశీలించారు. ఫీవర్ సర్వే, డ్రైడే పనుల తీరుపై ఆరా తీశారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండేందుకు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎంపీవో రమేశ్, పంచాయతీ కార్యదర్శులు తిరుపతి, శిరీష ఉన్నారు.

సర్వే ఊరికే చేయరు..!

ధర్మారం మండలంలోని సుమారు 150 మంది రైతులు తమ భూములు సర్వే చేయాలని ఆర్నెల్ల క్రితం దరఖాస్తు చేశారు. ఇప్పటివరకు ఒక్క రైతు భూమి కూడా సర్వే చేయలేదు. సర్వేయర్ మూడు నెలలుగా లీవ్‌లో ఉన్నారు. అంతకుముందు ఎన్నికలు కావడంతో సర్వే చేయలేకపోయారు. ఇలాంటి పరిస్థితి జిల్లాలోని అన్ని మండలాల్లోనూ ఉంది. ఇలాంటి వాటిని ఆసరాగా చేసుకుంటున్న సర్వేయర్లు చేయ్యితడిపిన దరఖాస్తుదారుల భూములనే సర్వే చేస్తున్నారు. లేకపోతే కొర్రీలతో ఆలస్యం చేస్తున్నారని దరఖాస్తుదారులు వాపోతున్నారు. ఇలాంటి వేధింపులు తాళలేక కాల్వశ్రీరాంపూర్ మండలంలోని ఓ రైతు ఇటీవల సర్వేయర్ తీరుపై ప్రజావాణిలో ఫిర్యాదు చేశాడు.



భూసర్వే చేస్తున్న సర్వేయర్(ఫైల్)

- చేతులు తడపనిదే కదలరు
- చలాన్లు చెల్లించినా తప్పని నిరీక్షణ
- పరిష్కారానికి నోచుకోని భూ సమస్యలు
- కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న రైతులు

జిల్లా సమాచారం

అవసరమైన సర్వేయర్లు	14
ఉన్నవారు	07
డిప్యూటీ సర్వేయర్లు	03
పెండింగ్ దరఖాస్తులు	1,058

సాక్షి, పెద్దపల్లి: గట్టు తగవుల గుట్టు విప్పాలన్నా.. భూవివాదాలకు తెరదించాలన్నా.. శిఖం పంచాయితీలకు ఫుల్‌స్టాప్ పెట్టాలన్నా.. ఆక్రమణల నిగ్గు తేల్చాలన్నా.. భూసేకరణ చేపట్టాలన్నా.. అన్నింటికీ సర్వరోగ నివారిణి భూ సర్వేనే.. దీనికితోడు జిల్లా ఏర్పాటుతో భూములకు రెక్కలొచ్చాయి. వీటితోపాటే భూ వివాదాలూ పెరిగిపోతున్నాయి. ఇవి ఘర్షణలకు దారితీస్తున్నాయి. భూముల హద్దుల పంచాయితీలను అరికట్టేందుకు కొలతలు చేపట్టాలంటే సర్వేయర్ల కొరతతో దరఖాస్తుదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. అర్జీలన్నీ పెండింగ్‌లో ఉంటున్నాయి. అనేకమంది రైతులు కొలతల కోసం ఫీజు చెల్లించి సర్వేయర్ల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఉన్నకొద్దిపాటి సిబ్బంది కూడా పెండింగ్ దరఖాస్తుదారుల భూములు సర్వే చేయకుండా డబ్బులిచ్చిన వారి భూములు సర్వే చేస్తున్నారనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

అదనపు బాధ్యతలతో..

- ఒక మండలాన్ని పరిశీలిస్తే సగటున సర్వేయర్, ఇద్దరు చైన్‌మన్లు ఉండాలి.
- ఒక్కో సర్వేయర్ పరిధిలో రెండు, మూడు మండలాలు ఉండటంతో దరఖాస్తులను పరిశీలించడానికి కూడా సమయం సరిపోవడం లేదు.
- సర్వేయర్‌ను క్షేత్రస్థాయికి తీసుకొచ్చి సర్వే చేయించుకోవడానికి రైతులు ఏళ్ల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది.
- ప్రభుత్వం సాగునీటి, పవర్ ప్రాజెక్టులు, రహదారుల విస్తరణ, వక్ఫ్, దేవాదాయ, అటవీ, భూదాన్ తదితర కేటగిరీల భూముల సర్వే చేపట్టడం కూడా సిబ్బందికి భారంగా మారింది.
- ప్రభుత్వ ప్రాధాన్యతా సర్వేలను తొలుత చేపట్టాల్సి రావడంతో రైతుల భూ సర్వేలను పక్కనపెట్టాల్సి వస్తోంది.
- క్రమపద్ధతిలో దరఖాస్తులు పరిశీలించి సర్వే నిర్వహించాల్సిన సర్వేయర్లు కొందరు ఇవేవీ పట్టించుకోకుండా పలుకుబడి కలిగిన మోతుబరులు, చేయి తడిపేవారి భూములు ముందుగా కానిచ్చేస్తున్నారు.
- ఏమీ ఇచ్చుకోలేని చిన్న, సన్నకారు రైతులు నెలల తరబడి తిరిగితే తప్ప తమ భూములు సర్వే చేయించుకోలేకపోతున్నారు.
- ఇదేవిషయమై భూములు, సర్వేశాఖ ఏడీని వివరణ కోరగా జిల్లాలో సర్వేయర్ల కొరతతో ఆలస్యమవుతోందన్నారు. అలాగే ప్రభుత్వ ప్రాజెక్టుల భూసేకరణ సైతం చేయాల్సి ఉండడంతో జాప్యమవుతోందని తెలిపారు. సాధ్యమైనంత త్వరగా అర్జీలను పరిష్కారిస్తామని ఆయన వివరించారు.

ఇవీ సమస్యలు

- సర్వే విభాగాన్ని ఉద్యోగుల కొరత వేధిస్తోంది. దీంతో అర్జీలు పెరుగుతున్నా సర్వేయర్లు కదలడం లేదు.
- ప్రభుత్వ సాగునీటి ప్రాజెక్టులు, ఇతరత్రా ప్రభుత్వ కార్యక్రమాల కోసం సర్వే చేయాల్సి వస్తోంది.
- కొందరు సర్వేయర్లు రైతుల వద్ద డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. ఇవ్వకుంటే సర్వేకు నిరాకరిస్తున్నారు.
- రైతుల వద్ద డబ్బులు తీసుకున్న కొంతమంది సర్వేయర్లు అవతలి పక్షం వారితో కుమ్మక్కై సర్వేకు కదలడం లేదనే విమర్శలున్నాయి.
- భాగ పరిష్కారానికి సంబంధించిన సర్వేలు ముందుకు సాగడం లేదు.
- ఒక సర్వే నంబరులోని మొత్తం భూమిని మాత్రమే రికార్డుల ప్రకారం సర్వే చేస్తున్నారు.
- అందులో భాగ పరిష్కార వివాదాలు ఉంటే దరఖాస్తులు పెండింగ్‌లో పెడుతున్నారు.



మురిసిన చదువులమ్మ

8లో▸

ధర్మారం మండలం నందిమేడారంలోని గురుకుల పాఠశాల ఆవరణ శనివారం విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, కుటుంబసభ్యుతో సందడిగా మారింది. చాలారోజుల తర్వాత తమ పిల్లలను నేరుగా కలుసుకుని క్షేమసమాచారం తెలుసుకున్న తల్లిదండ్రులు.. ఆప్యాయంగా పలకరించిన తల్లిదండ్రులతో చిన్నారులు.. రోజంతా ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

కరెంట్ కనెక్షన్లు కట్ చేశారు..



మంథనిలోని ప్రధాన రహదారిపై బైఠాయించిన మహిళలు

మంథని: కాకర్లపల్లి గ్రామంలో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారి ఇళ్ల విద్యుత్ కనెక్షన్లను ముందస్తు సమాచారం ఇవ్వకుండా అధికారులు తొలగించడమే కాకుండా దళిత మహిళపై చేయికున్నారని ఆగ్రహించిన మహిళలు.. శనివారం పట్టణంలోని ప్రధాన చౌరస్తాలో రాస్తారోకో చేశారు. వీరికి మద్దతుగా నిలిచిన ప్రజా సంఘాల నాయకులు బూడిద గణేశ్, ఆర్ల సందీప్ మాట్లాడుతూ విద్యుత్ శాఖ అధికారులు కేవలం ఎస్సీ సామాజిక వర్గాల వాడల్లోని ఇళ్ల విద్యుత్ కనెక్షన్లు తొలగిచడం ఏమిటని ప్రశ్నించారు. విద్యుత్ కనెక్షన్లు తొలగించి, తీగలను ముక్కలుగా కట్‌చేసి ఆటవిక ఆనందం పొందారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ తీగలు కట్ చేయవద్దని వేడుకున్న మహిళపై చేయి చేసుకున్నారని వారు ఆరోపించారు. వెంటనే విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని, మహిళపై చేయి చేసుకున్న అధికారిపై తగిన చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎస్సీ సామాజిక వర్గం పక్షాన ఉద్యమాలు చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మంథని అశోక్, గుండారం శ్రీనివాస్, మంథని సమ్మయ్య, లత, మౌనిక, మంథని లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మరో 30క్వార్టర్ల విద్యుత్ కనెక్షన్ తొలగింపు

- సింగరేణి సిబ్బందితో కార్మికుల వాగ్వాదం



సీఐతో వాగ్వాదానికి దిగుతున్న సింగరేణీయులు

గోదావరిఖని: రోడ్డు విస్తరణ ప్రక్రియను సింగరేణి యాజమాన్యం వేగవంతం చేసింది. ఇందుకోసం అడ్డుగా ఉన్న క్వార్టర్లను తొలగిస్తోంది. అందులో నివాసం ఉంటున్న కార్మికులు ఖాళీ చేయకపోవడంతో వాటి విద్యుత్ కనెక్షన్లు తొలగిస్తోంది. ప్రధానంగా లక్ష్మీనగర్‌ను ఆనుకుని ఉన్న 30క్వార్టర్ల విద్యుత్ కనెక్షన్లను శనివారం తొలగించింది. గతంలో నోటీసులు జారీచేసినా ఖాళీ చేయడంలేదని పేర్కొంటూ ఈ చర్య తీసుకుంది. మున్సిపల్ షాపింగ్ కాంప్లెంగ్ వెనకాల గల క్వార్టర్ల కనెక్షన్లు తొలగిస్తుండడంతో కార్మిక కుటుంబాలు సిబ్బందిని అడ్డుకున్నారు. దీంతో సెక్యూరిటీ సిబ్బందితోపాటు పోలీసులు రంగ ప్రవేశం చేశారు. కార్మికులను శాంతింపజేశారు. క్వార్టర్లను ఖాళీ చేస్తే వేరేప్రాంతంలో క్వార్టర్లు కేటాయిస్తామని స్పష్టం చేశారు. అయినా, అనుకూలమైన క్వార్టర్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని కార్మికులు ఆందోళనకు దిగారు. ఈక్రమంలో సీఐ ఇంద్రసేనారెడ్డి అక్కడకు చేరుకుని కార్మికులకు సర్దిచెప్పారు. గొడవకు దిగవద్దని, యాజమాన్యంతో మాట్లాడుకోవాలని సూచించారు. బీఆర్‌ఎస్ నాయకులు కౌశిక్‌హరి చేరుకుని కార్మికులకు సంఘీభావం ప్రకటించారు.

అడుగడుగునా గుంతలు





పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రం నుంచి వివిధ ప్రాంతాలకు అనుసంధానించిన ప్రధాన రహదారులపై గుంతలు ఏర్పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. అయినా, సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. పెద్దపల్లి – ధర్మారం ప్రధాన రోడ్డుపై కనగర్తి మలుపు సమీపంలో ఏర్పడ్డ గుంతలోపడి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ముఖ్యంగా ద్విచక్రవాహనదారులు అనేకమంది గాయాలపాలయ్యారు. పెద్దపల్లి – చీకురాయి – భోజన్నపేట –మూలసాల మధ్యగల రంగంపల్లి వద్ద అడుగుకో గుంత ఏర్పడింది. ఈ మార్గంలో ప్రయాణం నరకం చూపుతోంది. ఇక జిల్లాకేంద్రంలోని అంతర్గత రహదారులు సైతం అధ్వానంగా మారాయి. అమర్‌నగర్ సమీపంలోని సబ్ కోర్టుకు వెళ్లే రోడ్డుపై ఏర్పడ్డ గుంతతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి గుంతలు పూడ్చాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

మెలకువలు.. ఆధునిక పోకడలు

అన్నదాతలకు శాస్త్ర పరిజ్ఞానం

- 'రైతునేస్తం' పేరిట సరికొత్త కార్యక్రమానికి రూపకల్పన
- ప్రతీ మంగళవారం సాగు–పాడి సమస్యలపై సమాధానాలు
- ప్రొఫెసర్ జయశంకర్ వర్సిటీ శాస్త్రవేత్తలతో రైతుల భేటీ
- ప్రతీ రైతువేదికలో వీడియో కాన్ఫరెన్స్ పరికరాల ఇన్‌స్టాలేషన్
- ఇప్పటికే ప్రతీ వేదికకు టీ–ఫైబర్ కనెక్షన్

ఉమ్మడి జిల్లాలో రైతు వేదికలు

కరీంనగర్	జగిత్యాల
75	71
పెద్దపల్లి	రాజన్నసిరిసిల్ల
54	57

వ్యవసాయంలో నూతన మెలకువలు, ఆధునిక పోకడలను పరిచయం చేయడమే లక్ష్యంగా రైతుల కోసం ప్రభుత్వం రైతునేస్తం కార్యక్రమాన్ని వచ్చే మంగళవారం నుంచి ప్రారంభించనుంది. వాస్తవానికి మార్చిలోనే ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి అంకురార్పణ చేశారు. ఎన్నికల కోడ్ రావడంతో కాస్త ఆలస్యమైంది. కోడ్ ముగిసిన దరిమిలా తిరిగి రైతునేస్తం ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. తొలుత నియోజకవర్గానికి ఒక రైతు వేదికను యూనిట్‌గా తీసుకున్న అధికారులు అందులో వీడియోకాన్ఫరెన్స్ పరికరాలు ఏర్పాటు చేశారు. తర్వాత ప్రతీ మండల కేంద్రంలో ఉన్న రైతు వేదికలో ఈ సదుపాయాన్ని విస్తరించే పనులు మొదలయ్యాయి. ఈనెల 15 నాటికి రాష్ట్రంలోని అన్ని మండలాల్లో వీడియో కాన్ఫరెన్స్ పరికరాలు ఏర్పాటయ్యేలా పనులు ఊపందుకున్నాయి. ఇందుకోసం రైతు వేదికలకు ఇప్పటికే టీ–ఫైబర్ కనెక్షన్లు ఇచ్చేశారు.





సాక్షిప్రతినిధి,కరీంనగర్:

రైతులకు వ్యవసాయంలో నవీన పద్ధతులు, ఆధునిక పనిముట్ల వినియోగం, సాగులో సమస్యలు, చీడ–పీడల నివారణ, నూతన వంగడాల వినియోగం, ఆధునిక పనిముట్ల పరిచయం, రైతుల విజయగాథలు తదితర అంశాలను శాస్త్రవేత్తలు రైతులకు వివరిస్తారు. వారి సందేహాలు నివృత్తి చేస్తారు. ఇందుకోసం ప్రొఫెసర్ జయశంకర్ వర్సిటీ శాస్త్రవేత్తలు ప్రతీవారం రైతులతో చర్చించే అంశాలను ముందే ఎజెండా కింద రైతు వేదికలకు వ్యవసాయాధికారుల ద్వారా పంపుతారు. దీంతో వారి నుంచి రైతులకు ముందే సమాచారం చేరిపోతుంది. దాని ఆధారంగా ఏయే ప్రశ్నలు అడగాలో ముందే రైతులు సన్నద్ధమై వస్తారు. రైతులకు శాస్త్ర సాంకేతిక సాయం అందించి వారికి తోడ్పాటు అందించడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం. పట్టణాలు, నగరాలు మినహా సాగుభూమి ఉన్న ప్రతి మండలాల్లో 16 నుంచి రైతు నేస్తం అమలు కానుంది. మున్ముందు ఈ కార్యక్రమాన్ని యూట్యూబ్/జూమ్ వేదికలక్కు అనుసంధానం చేయనున్నారు.

సిద్ధంగా రైతు వేదికలు

ఈ కార్యక్రమ నిర్వహణకు కావాల్సిన వీడియో కాన్ఫరెన్స్ పరికరాలను ఇన్‌స్టాలేషన్, టీ–ఫైబర్ ఇన్‌స్టాలేషన్ తదితరాలు దాదాపు పూర్తయ్యాయి. స్పీకర్లు, మౌత్‌లు చేరుకున్నాయి. కూర్చునేందుకు వీలుగా ప్రతీ రైతు వేదికల్లోనూ దాదాపు 125 వరకు కుర్చీలు అందుబాటులో ఉంటాయి. ఈ కార్యక్రమాన్ని ఇక ముందు మరింత సమర్థంగా వినియోగించుకోవాలన్నది ముఖ్యమంత్రి రేవంత్ యోచన. రైతు భరోసాలో ప్రజాభిప్రాయసేకరణలో ఇప్పటికే రైతు వేదికలే కీలకంగా మారాయి. భవిష్యత్తులోనూ రైతు వేదికలు కేంద్రంగా రైతులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశాలు, వారి అభిప్రాయాలు అడిగి తెలుసుకోవాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ఉత్తమ రైతులకు సన్మానాలు, అభినందనలు తెలియజేసేందుకు ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి, ఇతర ముఖ్య అధికారులు తదితరులు 'రైతు నేస్తం'కార్యక్రమాన్నే వేదికగా మలచుకోనున్నారు. భవిష్యత్తులో రైతులకు ఇవి బహుళ ప్రయోజన కేంద్రాలుగా రూపాంతరం చెందనున్నాయని వ్యవసాయాధికారులు 'సాక్షి'కి తెలిపారు.

చెరువు కట్టను కబ్జా చేశారు



రైతులతో మాట్లాడుతున్న ఎస్సై వెంకటకృష్ణ

మంథని: బిట్టుపల్లి పెద్దచెరువు ఆయకట్టు రైతులు శనివారం ఆందోళనకు దిగారు. ఇద్దరు రైతులు జేసీబీ సాయంతో చెరువు కట్ట తొలగించి చదును చేసి పంటలు వేసేందుకు యత్నిస్తున్నారని వారు ఆరోపించారు. అంతేకాదు.. ఇద్దరు రైతులతో మిగతావారు వాగ్వాదానికి దిగారు. చెరువు కట్టను చదును చేయొద్దని సూచించారు. పరిస్థితి ఉద్రిక్తతకు దారితీసింది. సమాచారం అందుకున్న ఎస్సై వెంకటకృష్ణ తన సిబ్బందితో కలిసి వెంటనే సంఘటన స్థలానికి చేరుకొన్నారు. ఆందోళన విరమించాలని సూచించార. అయితే, కలెక్టర్, లేదా ఆర్డీవో వచ్చి కబ్జాదారులపై చర్య తీసుకోవాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. అంతటితో ఆగకుండా మంథనికి చేరుకొని ప్రధాన చౌరస్తా వద్ద రాస్తారోకో చేశారు. ఎస్సై అక్కడకూ చేరుకొని సమస్యను ఆర్డీవో హనుమా నాయక్‌కు ఫోన్‌లో వివరించారు. శని, ఆదివారాల్లో సెలవు కావడంతో అధికారులు అందుబాటులో లేరని, అయినా, విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

క్లుప్తంగా

చికిత్స పొందుతూ యువకుడి మృతి


శ్రీనాథ్(ఫైల్)

ముస్తాబాద్(సిరిసిల్ల): ప్రేమ విషయంలో మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. ముస్తాబాద్ ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాలు. గంభీరావుపేట మండలం లింగన్నపేటకు చెందిన తుడుము శ్రీనాథ్(24) శ్రీనాథ్ ఓ అమ్మాయిని ప్రేమించిన విషయంలో తలెత్తిన సంఘటనలతో మనస్తాపానికి గురయ్యాడు. ఈక్రమంలో ఈనెల 10న ముస్తాబాద్ మండలం బందనకల్ శివారులో పురుగులమందు సేవించాడు. అపస్మారక స్థితిలో ఉన్న శ్రీనాథ్‌ను సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడే చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

స్వగ్రామానికి మృతదేహం


సురేశ్ (ఫైల్)

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం హబ్సీపూర్ గ్రామానికి చెందిన వంగ సురేశ్ (35) గతనెల 23న ఇరాక్‌లో గుండెపోటుతో మృతిచెందాడు. ఆయన మృతదేహం శనివారం స్వగ్రామం చేరుకుంది. సురేశ్‌కు భార్య వసంత, ఇద్దరు కుమారులున్నారు.

కొత్తపేటకు చెందిన మరో వ్యక్తి..

రాయికల్: మండలంలోని కొత్తపేటకు చెందిన తునికి శేఖర్ (27) మృతదేహం శనివారం స్వగ్రామానికి చేరింది. 20రోజుల క్రితం షార్జాలో శేఖర్ ఆత్మహత్య చేసుకున్నాడు. అక్కడ ఉంటున్న జీడబ్ల్యూపీసీ అధ్యక్షుడు గుడెల్లి నర్సింహ, బొడ్డుపల్లి రాంకు సమాచారం ఇవ్వడంతో వారు స్పందించి శేఖర్ పనిచేస్తున్న కంపెనీ యాజమాన్యంతో మాట్లాడి మృతదేహాన్ని స్వగ్రామానికి పంపించారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

జగిత్యాలక్రైం: జగిత్యాలలోని అశోక్‌నగర్‌కు చెందిన ఏదుల కిశోర్ (46) మోతె చెరువులో పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. అశోక్‌నగర్‌కు చెందిన కిశోర్ కొన్నేళ్లుగా కిరాణం షాపు నిర్వహిస్తున్నాడు. వ్యాపారం సరిగ్గా సాగక సుమారు రూ.5లక్షల మేర అప్పులయ్యాయి. అప్పులు తీర్చడం ఇబ్బందిగా మారడంతో మనస్తాపానికి గురై శుక్రవారం రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. జగిత్యాల అర్బన్ మండలం మోతె శివారులోని చెరువులో పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య భవాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై సదాకర్ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

రామగుండం: స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయం వెనకాల గుట్ట సమీపంలోని నిర్మానుష్య ప్రాంతంలోని పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం దాడి చేశారు. ఈ సందర్భంగా ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారినుంచి రూ.17,200 నగదు, నాలుగు మొబైల్ ఫోన్లు, రెండు బైక్‌లు, ఒక ఆటో స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఎస్సై రవిప్రసాద్, హెడ్ కానిస్టేబుళ్లు రాజేందర్, మహేందర్, కానిస్టేబుళ్లు ప్రకాశ్, అఖిల్, మల్లేశ్, రాజేందర్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.







మురిసిన చదువులమ్మ

తల్లిదండ్రులు, అక్కాచెల్లెళ్లు, అన్నదమ్ములు, ఆప్తులతో సంబురపడిపోయిన తన పిల్లల్ని చూసి చదువులమ్మ తల్లి సరస్వతీదేవి మురిసిపోయింది. కొద్దిరోజులుగా కుటుంబాలకు దూరంగా వసతి గృహంలో ఉంటూ చదువుకుంటున్న చిన్నారులు.. సెలవు రోజున అయినవారు రావడంతో ఎగిరి గంతేశారు.. అమ్మానాన్నలు తినిపించే గోరుముద్దలు పుష్టిగా తిన్నారు.. చాక్లెట్లు, ఐస్‌క్రీమ్స్ లాగేశారు.. అమ్మానాన్నలతో సెల్ఫీ దిగారు.. అక్కచెల్లెళ్లతో కబుర్లు చెప్పుకున్నారు.. అన్నదమ్ములతో మొబైళ్లలో గేమ్స్ ఆడుకున్నారు.. రోజంతా ఆనందంగా గడిపారు.. ఇంతటి పండుగ వాతావరణానికి వేదికైంది పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నందిమేడారం గురుకుల పాఠశాల. రెండో శనివారం సందర్భంగా విద్యార్థులను కలుసుకునేందుకు పాఠశాల యాజమాన్యం అవకాశం కల్పించడంతో వందల సంఖ్యలో తల్లిదండ్రులు తరలివచ్చి తమ పిల్లలతో ఇలా సరదాగా గడిపారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి







రిలే నిరాహారదీక్షకు అనుమతి ఇవ్వండి

- పోలీసులకు నేరెళ్ల బాధితుడి వినతి

తంగళ్లపల్లి(సిరిసిల్ల): నేరెళ్ల బాధితుల అంశం మరోమారు తెరపైకి వచ్చింది. రాజన్నసిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో నేరెళ్ల బాధితుడు కోల హరీష్ శనివారం వినతిపత్రం అందించి మాట్లాడారు. 2017లో అప్పటి ఎస్పీ, ఎస్సైలు నేరెళ్లకు చెందిన తనతోపాటు పెంట బానయ్య, పసుల ఈశ్వర్, బత్తుల మహేశ్, చెప్యాల బాలరాజు, గంధం గోపాల్‌లపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారన్నారు. అప్పటి ప్రభుత్వం అధికారులకు వంతపాడిందని, ప్రస్తుత ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సంఘటనపై తమకు న్యాయం చేయాలని


తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్ ఎదుట కోల హరీశ్

కోరుతూ ఈనెల 17వ తేదీ నుంచి నేరెళ్ల గ్రామంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈమేరకు తంగళ్లపల్లి పోలీసుల నుంచి అనుమతి కోసం వినతిపత్రం అందజేసినట్లు పేర్కొన్నారు.

పోలీసు డాగ్ మృతి

- 8 ఏళ్లపాటు సేవలు
- నివాళి అర్పించిన ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం: జిల్లా పోలీసుశాఖలో ఎనిమిదేళ్లుగా డాగ్‌స్క్వాడ్‌లో విధుల్లో ఉన్న జాగిలం ట్యాంగో శనివారం అనారోగ్యంతో మృతిచెందింది. జాగిలం మృతికి సంతాపంగా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఎస్పీ అఖిల్ మహాజన్ పూలగుచ్ఛం ఉంచి నివాళి అర్పించారు. జిల్లాలో 15 హత్య కేసులు, 84 దొంగతనాలలో మొత్తంగా 99 కేసులలో నిందితులను గుర్తించడంలో కీలకంగా వ్యవహరించినట్లు గుర్తు చేశారు. 2017లో ట్యాంగో తన హ్యాండ్లర్ లక్ష్మణ్‌తోపాటుగా ఎనిమిది నెలలపాటు ఐబీటీఏ మొయినాబాద్‌లో


నివాళి అర్పిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

శిక్షణ పూర్తి చేసుకుంది. శిక్షణ అనంతరం జిల్లాలో సేవలందించింది. ఏఎస్పీ చంద్రయ్య, ఆర్‌ఐలు యాదగిరి, మధుకర్, రమేశ్, హ్యాండ్లర్ లక్ష్మణ్, డాగ్‌స్క్వాడ్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బెట్టింగ్ కోసం దొంగతనాలు

- పోలీసులకు చిక్కి కటకటాల పాలు
- ట్రాక్టర్ చోరీ కేసులో నలుగురి అరెస్ట్

వేములవాడ: ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటుపడిన వారు డబ్బుల కోసం దొంగతనాల బాటపట్టారు. డబ్బులు సరిపోక ట్రాక్టర్‌ను దొంగలించిన ముగ్గురు యువకులతోపాటు దాన్ని కొనుగోలు చేసిన వ్యక్తిని రాజన్నసిరిసిల్ల జిల్లా పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ వివరాలను ఎస్పీ అఖిల్‌మహాజన్ శనివారం వేములవాడరూరల్ సీఐ కార్యాలయంలో వెల్లడించారు. రాజన్నసిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం వర్దవెల్లికి చెందిన మందల సాయి, మందల వెంకటేశ్, మందల వంశీ ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌లకు అలవాటుపడ్డారు. బెట్టింగ్‌కు డబ్బులు సరిపోకపోవడంతో బోయినపల్లి మండలం రాజన్నపేటకు చెందిన ఈడుగు కనకయ్య ట్రాక్టర్‌ను దొంగలించారు. ట్రాక్టర్‌కు ఉన్న కేజీవీల్స్‌ను తప్పించి కల్టీవేటర్‌తో ఎత్తుకెళ్లారు. తన ట్రాక్టర్ దొంగతనానికి గురైనట్లు కనకయ్య ఈనెల 2న బోయినపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి ఆధ్వర్యంలో రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై పథ్వీధర్‌గౌడ్, కానిస్టేబుళ్లు కోటేశ్వర్, తిరుపతిలతో టీం ఏర్పాటు చేశారు.


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్, చిత్రంలో ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, సీఐ శ్రీనివాస్

సీసీ కెమెరాల ఆధారంగా

దొంగతనానికి గురైన ట్రాక్టర్‌ను పట్టుకునేందుకు పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా విచారణ చేపట్టారు. బోయినపల్లి మండలం రాజన్నపేటలోని కనకయ్య ఇంటి నుంచి దేశాయిపల్లి, రత్నంపేట, గుండన్నపల్లి, కోరెం, వట్టెంల, నూకలమర్రి, నర్సింగాపూర్(చందుర్తి మండలం), మల్యాల, లింగంపేట, రుద్రంగి మండలం మానాల మీదుగా భీంగల్, ఆర్మూర్ మీదుగా నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలంలోని మోడెంకు చేరుకున్నట్లు తెలుసుకున్నారు. మోడెంకు చెందిన గంజాయి పోశెట్టికి ట్రాక్టర్ విక్రయించినట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు.

నలుగురి అరెస్టు

ట్రాక్టర్ దొంగతనానికి పాల్పడ్డ మందల సాయి, మందల వెంకటేశ్, మందల వంశీ, ట్రాక్టర్‌ను కొనుగోలు చేసిన గంజాయి పోశెట్టిలను శనివారం అరెస్టు చేశారు. వారి నుంచి రూ.4.50లక్షల విలువైన జాన్‌డీర్ ట్రాక్టర్, కల్టీవేటర్, షిఫ్ట్ డిజైర్ కార్, ద్విచక్ర వాహనం, 5 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

పోలీసులకు అభినందనలు

దొంగలను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై పృథ్వీధర్‌గౌడ్, కానిస్టేబుళ్లు కోటేశ్వర్, తిరుపతిలను అభినందించి క్యాష్ రివార్డు అందజేశారు.

ఆర్థిక ఇబ్బందులతో వృద్ధురాలు ఆత్మహత్య


సరోజ(ఫైల్)

వీర్నపల్లి(సిరిసిల్ల): వీర్నపల్లి మండల కేంద్రానికి చెందిన గిరిజన వృద్ధురాలు గుగులోత్ సరోజ(56) ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాలు. సరోజ భర్త పీర్యా 1994లో పోలీసుల ఎన్‌కౌంటర్‌లో మృతిచెందగా.. అప్పటి నుంచి ముగ్గురు ఆడపిల్లలను పెంచి పోషించింది. ఇద్దరు కూతుళ్లకు వివాహం చేయగా.. రూ.15లక్షల వరకు అప్పు అయ్యింది. అప్పు తీర్చే మార్గం లేకపోవడంతోపాటు అనారోగ్య సమస్యలు వచ్చాయి. ఈక్రమంలో మనోవేదనతో శుక్రవారం పురుగులమందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ప్రైవేట్ హాస్పిటల్‌లో చేర్పించగా.. శనివారం తుదిశ్వాస విడిచింది. చిన్నకూతురు సరితకి వివాహం కాలేదు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చెత్త పంచాయితీ


పంచాయతీ కార్యాలయం గేట్ ఎదుట వేసిన చెత్త

మేడిపల్లి: చెత్త తరలించే వాహనం రావడం లేదని పేర్కొంటూ జగిత్యాల జిల్లా భీమారం మండలం కమ్మరిపేట గ్రామానికి చెంది వన్నెల శివానందం గ్రామ పంచాయతీ ఎదుట చెత్త పోసి నిరసన తెలిపాడు. శివానందం మూడురోజులుగా ఇంట్లో వివిధ పండుగలు చేస్తున్నాడు. ఆ చెత్తను తీసుకెళ్లేందుకు పంచాయతీ ట్రాక్టర్ పంపించాలని కార్యదర్శి నురుద్దీన్ అబిద్‌ను కోరగా.. ఆయన నిరాకరించాడు. దీంతో ఆగ్రహించిన శివానందం చెత్తను గ్రామ పంచాయతీ ఎదుట పడేసి నిరసన తెలిపాడు. గ్రామపెద్దలు గ్రామ పంచాయతీ వద్దకు చేరుకుని పై అధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇవ్వడంతో శివానందం శాంతించి పడేసిన చెత్తను తొలంగించాడు.


చోరీ కేసులో అరెస్ట్


నిందితుడి అరెస్టు చూపుతున్న సీఐ సుబ్బారెడ్డి

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): వ్యవసాయ పనులకు వినియోగించే రొటవేటర్ చోరీచేసిన కేసులో నిందితుడిని శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు సీఐ సుబ్బారెడ్డి తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. ఓదెల మండలం కొలనూర్‌కు చెందిన తిరుపతిరెడ్డి సుల్తానాబాద్‌లో నివాసం ఉంటున్నాడు. పెద్దపల్లి మండలం కొత్తపల్లిలో 10 ఎకరాలు, కొలనూర్ మరో 10 ఎకరాలు కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. సుద్దాలలోని తొగరి అశోక్‌కు చెందిన రొటోవేటర్‌ను తన వ్యవసాయ భూమి వద్ద ఉంచగా అది చోరీకి గురైంది. దీంతో శనివారం ఉదయం బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈక్రమంలో గట్టెపల్లి రోడ్డు వద్ద పోలీసులు సాయంత్రం వాహనాలు తనిఖీ చేశారు. అయితే, తిరుపతిరెడ్డి ట్రాక్టర్‌కు రొటోవేటర్ తగిలించుకొని సుల్తానాబాద్‌కు వస్తుండగా అనుమానం వచ్చి పోలీసులు విచారించారు. రొటోవేటర్ చోరీచేసిందని నిర్ధారణ కావడంతో తిరుపతిరెడ్డిని అరెస్టు చేశారు. కేసును కొద్దిగంటల్లోనే ఛేదించినఎస్సైలు శ్రావణ్‌కుమార్, నరేశ్, ఏఎస్సై తిరుపతి, కానిస్టేబుల్ రమేశ్‌ను సీఐ అభినందించారు.

పల్లె సంస్కృతిని ఆవిష్కరించిన ‘వరి గొలుసులు’

- ‘గ్రెయిన్ చైన్స్’ పేరిట ఆంగ్లంలోకి అనువదించిన కవి సవ్యసాచి
- నేడు ఫిల్మ్‌భవన్‌లో ఆవిష్కరణ



వరి గొలుసులు తెలుగు కవితా సంపుటి ముఖచిత్రం

విద్యానగర్(కరీంనగర్): తెలంగాణ యాస, భాష, సంస్కృతికి అద్దం పడుతూ కవితలు, కథనాలు రాసే కాలమిస్ట్ అన్నవరం దేవేందర్ రాసిన ‘వరి గొలుసులు’ కవిత సంపుటిని కవి, అనువాదకుడు సవ్యసాచి ‘గ్రెయిన్ చైన్స్’ పేరిట ఆంగ్లంలోకి అనువాధించారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లికి చెందిన సవ్యసాచి కరీంనగర్ భద్రాద్రి కోపరేటివ్ అర్బన్ బ్యాంక్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉదయం 10గంటలకు కరీంనగర్ ఫిల్మ్‌భవన్‌లో ప్రముఖ చలనచిత్ర దర్శకుడు, కవి రచయిత బి.నర్సింగరావు గ్రెయిన్ చైన్స్ కవిత సంపుటిని ఆవిష్కరించనున్నారు.

మూడవ ఆంగ్ల అనువాద సంపుటి



2001లో తొవ్వ కవితా సంపుటితో సాహితీ ప్రస్థానాన్ని ప్రారంభించిన నేను ఇప్పటి ‘గ్రెయిన్ చైన్స్’ వరకు 19 పుస్తకాలు రాసి ప్రచురించా. నేను రాసిన తొవ్వ, నడక, మంకమ్మతోట లేబర్ అడ్డా, దొడ్డు మల్లెచెట్టు కవితా సంపుటిల నుంచి కొన్ని కవితలను ఎంపిక చేసుకుని ‘ఫ్యాం ల్యాండ్ ఫ్రాగ్రాన్స్’ పేరున 2011లో నిజాం కళాశాల అధ్యాపకురాలు పి.జయలక్ష్మి చేసిన అనువాదం మొదటి ఆంగ్ల అనువాద సంపుటి. పొద్దుపొడుపు, పొక్కిలి వాకిళ్ల పులకరింత, ఇంటి దీపం, గవాయి, వరిగొలుసులు సంపుటిల నుంచి కొన్ని కవితలను ఎంపిక చేసుకుని 2022లో ‘ది అన్ ఈల్డింగ్ స్కై’ పేరున డాక్టర్ మంతెన దామోదరచారి ఆంగ్లంలోకి అనువదించారు. వరి గొలుసులు సంపుటిలోని అన్ని కవితలను గ్రెయిన్ చైన్స్ పేరుతో సవ్యసాచి ఆంగ్లంలోకి అనువాదం చేశారు.

– అన్నవరం దేవేందర్, కవి, రచయిత, కాలమిస్ట్, కరీంనగర్

తెలంగాణ భాషపై ఇష్టంతో..

కవిత్వం రాసే నాకు ‘గ్రెయిన్ చైన్స్’ మొదటి ఇంగ్లిష్ అనువాదమే. అన్నవరం రాస్తే తెలంగాణ భాష సొగసులు నచ్చడం, పల్లె భాషపై ఇష్టపడి వరి గొలుసులు కవితా సంపుటిని ఆంగ్లంలోకి అనువాదించా.

– సవ్యసాచి, కవి, అనువాదకుడు

కాలు కోల్పోయాడు.. పెన్షన్ వస్తలేదు

- పింఛన్ ఇప్పించాలని మంత్రి ‘పొన్నం’కు వేడుకోలు


వెల్డింగ్ పని చేస్తున్న మధు

చిగురుమామిడి(హుస్నాబాద్): ఆ యువకుడు దివ్యాంగుడు.. కుటుంబానికి ఎలాంటి ఆస్తిపాస్తులు లేవు.. కుడి కాలు లేకపోయినా ధైర్యం కోల్పోలేదు.. ఆత్మవిశ్వాసంతో వెల్డింగ్ షాపు నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. యువతకు ఆదర్శంగా నిలుస్తున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. చిగురుమామిడి మండలంలోని ఓగులాపూర్‌కు చెందిన గట్టు మధుకు భార్య, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. మూడేళ్ల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో తన కుడి కాలు పోగొట్టుకున్నాడు. ఎలాంటి ఆస్తులు లేకపోవడంతో రూ.లక్ష అప్పు చేసి, కృత్రిమ కాలు అమర్చుకున్నాడు. జీవనోపాధి కోసం దారులు వెతికాడు. తన స్నేహితుడి సలహా మేరకు వెల్డింగ్ షాపు నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అయితే, దివ్యాంగుల పెన్షన్ కోసం గత ప్రభుత్వం హయాంలో దరఖాస్తు చేసుకున్నాడు. కానీ, మంజూరవలేదు. కొద్దిపాటి అంగవైకల్యం ఉన్నవారు కూడా పింఛన్ పొందుతున్నారని, తనకు ఒక కాలు పూర్తిగా లేకున్నా అధికారులు గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ స్పందించి, పెన్షన్ ఇప్పిస్తే తన కుటుంబానికి మరింత ఆసరాగా ఉంటుందని కోరుతున్నాడు.

దొరికింది బొమ్మ తుపాకే..

సారంగాపూర్: బీర్‌పూర్ మండలకేంద్రంలో ఓ వ్యక్తి వద్ద లభించింది బొమ్మ తుపాకేనని పోలీసులు తేల్చారు. ఎస్సై కుమారస్వామి వివరాలు.. బీర్‌పూర్ మండలం కమ్మునూర్‌కు చెందిన తోట రాజ్‌కుమార్ జగిత్యాలలోని పోచమ్మవాడలో నివాసముంటాడు. బీర్‌పూర్ మండలకేంద్రంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో రాజ్‌కుమార్ వద్ద తుపాకీ ఉన్నట్లు గుర్తించారు. పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టగా.. తాను అమెజాన్‌లో బొమ్మ తుపాకీని కొనుగోలు చేశానని, షార్ట్‌ఫిల్మ్‌లు, ఫొటోషూట్‌ల కోసమే తుపాకీని వినియోగిస్తున్నానని వెల్లడించాడు. దీంతో పోలీసులు రాజ్‌కుమార్‌ను విడిచిపెట్టారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

కాపర్‌వైరు చోరీ

ఓదెల(పెద్దపల్లి): రూపునారాయణపేట గ్రామంలో 100 మంది రైతులకు చెందిన కరెంట్ మోటార్ల కాపర్‌వైర్‌ను శుక్రవారం రాత్రి దొంగలు చోరీ చేశారు. గ్రామశివారులోని మానేరు పరీవాహక చెక్‌డ్యామ్ ప్రాంతంలో రైతులకు సంబంధించిన విద్యుత్ మోటార్లు ధ్వంసం చేసిన దొంగలు రాగితీగ అపహరించారు. వరినాట్లు ముమ్మరంగా సాగుతున్న ఈతరుణంలో చోరీ జరగడంతో కొందరి వరినాట్లు నిలిచిపోయాయి.